క్లుప్తంగా

ఆంధ్రకేసరి యూనివర్సిటీకి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్ జీ

ఒంగోలు టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒంగోలులో ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని మల్లయ్యలింగం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలో అన్ని విభాగాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా నేటికీ ఆ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే మంత్రి లోకేష్ తన మాట నిలుపుకోవాలని కోరారు. జీవో నంబర్ 77 రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. డిగ్రీ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు పవన్ కళ్యాణ్, రామాంజి, సురేంద్ర, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత కూటమి..!

- గ్రామాల్లో చెత్త సేకరించే క్లాప్ మిత్రల నియామకంలో నిర్లక్ష్యం
- చెత్త సేకరణ మాత్రం సక్రమంగా జరగాలంటూ కార్యదర్శులపై ఒత్తిడి
- సర్వేలో ఫిర్యాదులొస్తే కార్యదర్శులపై చర్యలకు ఆదేశాలు
- తీవ్ర మనోవేదనకు గురవుతున్న కార్యదర్శులు
- పలుచోట్ల క్లాప్ మిత్రల విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులు
- రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత చర్యలకు బలవుతున్నామంటూ ఆవేదన


మద్దిపాడు మండలంలోని ఓ గ్రామంలో చెత్త సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం అనాలోచిత చర్యలకు కార్యదర్శులు బలైపోతున్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం తప్పనిసరిగా జరగాలని, ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ప్రతి 1000 మంది జనాభా లేదా 250 గృహాలకు ఒక క్లాప్ మిత్రను నియమించుకోవాలని గత వైఎస్సార్ సీపీ హయాంలో కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. అలా నియమించబడిన క్లాప్ మిత్రకు ప్రతి నెలా ఆరు వేల రూపాయలను గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి ఉంది. క్లాప్ మిత్రగా నియమించబడిన వారు ప్రతిరోజూ తమకు కేటాయించిన 250 ఇళ్ల నుంచి చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాల్సి ఉంది. ప్రతిరోజూ వీరు ఈ పని చేయాల్సి ఉంది. పండుగ దినాల్లో, ఆరోగ్యం బాగలేకపోయినా, తుఫాన్ సమయంలో, ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా వీరు తమకు కేటాయించిన 250 ఇళ్లకు తిరిగి ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం పొగాకు సీజన్ కావడం, పంచాయతీల్లో నెలవారీ జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో గ్రామాల్లో క్లాప్ మిత్రలుగా పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. క్షేత్రస్థాయిలో వీరి నియామకానికి అవసరమైన చర్యలపై కూటమి ప్రభుత్వం కూడా దృష్టి సారించలేదు. అయినప్పటికీ ప్రతి గ్రామంలో 100 శాతం చెత్త సేకరణ చేయించాలని కార్యదర్శులపై తీవ్రమైన ఒత్తిడిని ఉన్నతాధికారుల ద్వారా కూటమి ప్రభుత్వం తీసుకొస్తోంది. తమ గ్రామంలో క్లాప్ మిత్రగా చేరడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపినా, వారి ఆవేదనను అర్థం చేసుకునే వారు లేక పంచాయతీ కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఐవీఆర్ సర్వే ద్వారా మీ ఇంటికి క్లాప్ మిత్రలు వచ్చి చెత్త సేకరణ చేస్తున్నారా..? లాంటి ప్రశ్నలకు జవాబులను గ్రామ ప్రజల ద్వారా సేకరిస్తూ పనితీరు బాగలేదని వచ్చిన పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేగాకుండా విస్తరణాధికారులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలలో తాము చెత్త సేకరణలో పాల్గొన్న ఫొటోలను జిల్లా గ్రూప్లో పోస్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మంగళవారం, గురువారం, శనివారం క్లాప్ మిత్రలతో పాటు సంబంధిత పంచాయతీ కార్యదర్శి, విస్తరణాధికారి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు తడి చెత్త.. పొడి చెత్త గురించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో చెత్త నిర్వహణ గురించి వివరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామాల్లో చెత్తకుప్ప కనిపిస్తే చర్యలు ఉంటాయని, ప్రతిరోజూ గార్బేజీ కలెక్షన్ 100 శాతం జరగాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా మాట్లాడలేక, క్షేత్రస్థాయిలో సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక తీవ్రమైన ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు మనోవేదన గురవుతున్నారు. ఒకవేళ గ్రామాల్లో గార్బేజీ కలెక్షన్ చేయకపోతే ఎక్కడ ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందోనని భయపడుతూ కొన్ని గ్రామాల్లో క్లాప్ మిత్రలు సరిగా పనిచేయనందున పంచాయతీ కార్యదర్శులే క్లాప్ మిత్రలుగా విధులు నిర్వహిస్తూ అవస్థపడుతున్నారు.

చుండూరు రవిబాబుకు సన్మానం


చుండూరు రవిబాబును సన్మానిస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొక్కిలగడ్డ పాలచంద్రరావు శనివారం ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, గుండమాల సర్పంచ్ జయరావు, నాయకులు మల్లికార్జునరావు, తుల్లూరి వెంకటనారాయణ, కోటి యాదవ్, సురేష్, జాజుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దుంపా రమణమ్మను సన్మానించిన బత్తుల


దుంపా రమణమ్మ, చెంచిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి దంపతులను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు బడుగు ఇందిర, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు ప్రసన్న, మహిళా నాయకురాలు భూమిరెడ్డి రమణమ్మ, మహిళా విభాగం సంతనూతలపాడు మండల అధ్యక్షురాలు ఎం.సీతమ్మ, ఎంపీపీ పి.విజయ, వైస్ ఎంపీపీ పి.రాఘవమ్మ, మద్దులూరు సర్పంచ్ వి.శైలజ, సంతనూతలపాడు ప్రెసిడెంట్ వి.నాగమణి, వేములపాడు సర్పంచ్ విజయలక్ష్మి, రాధా, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- మహిళా సంఘ మండల అధ్యక్షురాలు పద్మ

సంతనూతలపాడు: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని మహిళా సంఘ మండల అధ్యక్షురాలు బంకా పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని పేర్నమిట్ట ఎస్టీకాలనీలో మహిళా సంఘం, గ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సభ నిర్వహించారు. పద్మ పాల్గొని మాట్లాడుతూ మహిళలు అనేక సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పోరాడి సాధించుకున్న హక్కుల స్ఫూర్తితో ఏర్పడిన మహిళా దినోత్సవాన్ని ప్రస్తుత పాలకులు ఒక ఈవెంట్గా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మహిళలు 8 గంటల పని దినం కోసం, ఓటు హక్కు కోసం, పని ప్రదేశంలో సౌకర్యాల కోసం సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్నటువంటి హక్కులను ఈ రోజు కేంద్రంలో ఉన్న ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బీజేపీ కాలరాస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అందుకు వంతపాడుతోందని ధ్వజమెత్తారు. మహిళలను రెండో తరగతి పౌరులుగా చూస్తూ వంటింటికే పరిమితం చేయడం కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. మహిళా సాధికారత, బేటీ బచావో బేటీ పడావో పేరుతో ఆర్భాటపు ప్రకటనలు చేస్తూ మహిళలపై నిరంతరం దాడులు, హత్యలు, లైంగిక దాడులు చేస్తున్నా పాలకులు కళ్లుమూసుకుని నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు వచ్చినా మహిళలకు మాత్రం రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలని యంత్రాలుగానే చూస్తోందని, మతోన్మాదం పేరుతో అణచి ఉంచాలని చూస్తోందని విమర్శించారు. మణిపూర్లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి లైంగిక దాడి చేసినా.. మోదీ ప్రభుత్వం మాట్లాడని పరిస్థితిని మనం చూశామన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు అనేక పథకాలిస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని గెలిచి 9 నెలలు కావస్తున్నా.. ఉచిత బస్సు, 18 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1,500 ఊసే ఎత్తడం లేదని పద్మ ధ్వజమెత్తారు. భవిష్యత్తులో మహిళలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. సభకు మహిళా సంఘ నాయకురాలు షేక్ మస్తాన్‌బీ అధ్యక్షత వహించగా, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మహిళా సంఘ నాయకులు షేక్ ఫాతిమా, మానికల శ్రీలక్ష్మి, షేక్ మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.


పేర్నమిట్టలో మాట్లాడుతున్న మహిళా సంఘ నాయకురాలు


సంతనూతలపాడులో డాక్టర్ రాధాదేవిని సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్, మహిళా క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతనూతలపాడులో వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు రంగాల మహిళలను ఘనంగా సత్కరించారు. సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ పమిడి హరిని, వైద్యురాలు డాక్టర్ రాధాదేవి, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి తదితరులను వాసవీ మహిళా క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి జయశ్రీ, ఉపాధ్యక్షురాలు నల్లమల్లి సుకన్యరాణి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకటశేషారావు, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పామిడి సుధాకర్ తదితరులు సత్కరించారు.

ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

ఒంగోలు టౌన్: ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఒంగోలు జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత పిలుపునిచ్చారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ చదువుకోవాలని, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ఎదగాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఉదయలక్ష్మి, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, కార్యవర్గ సభ్యులు జానీ బాషా, మెహబూబ్ బి.నాగరాజకుమారి, రమణా నాయక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం ఒక ఉత్సవం కాదు...

అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే కేవలం ఒక ఉత్సవం కాదని, మహోజ్వల పోరాటాలకు స్ఫూర్తినిచ్చే రోజని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. శనివారం ఒంగోలు నగరంలోని మల్లయ్యలింగం భవన్లో నిర్వహించిన మహిళా దినోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. సభకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు విజయ అధ్యక్షత వహించగా, ఈశ్వరయ్య ప్రసంగిస్తూ ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న మహిళా దినోత్సవాన్ని బూర్జువా పాలకులు ఉత్సవంగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు మతం, సంప్రదాయాల కట్టుబాట్ల సంకెళ్లను తెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా నాయకులు రావమ్మ, అనంతలక్ష్మి, ప్రమీల, కె.వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాస్, ఆర్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపకుండా అందర్నీ చదివించాలి...

తల్లిదండ్రులు ఆడపిల్ల, మగపిల్లాడు అనే వివక్ష చూపకుండా ఇద్దరినీ సమానంగా పెంచాలని, సమానంగా చదివించాలని డాక్టర్ కె.జ్యోత్స్న సూచించారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక చైతన్య స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు, కాలేజీ ప్రిన్సిపాల్ రాజకుమారి, ఏట రవీంద్రారెడ్డి, పి.కిరణ్, రాంబాబు, నవీన్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా టీవీ మెకానిక్‌లకు సత్కారం...

మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలు నగరంలోని బాపూజీ కాంప్లెక్స్‌లో మహిళా టీవీ మెకానిక్‌లు చేబ్రోలు సుకన్య, కిలారి రజనీలను శనివారం ఘనంగా సత్కరించారు. ఒంగోలు ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, అసిస్ట్ డిప్యూటీ సూపరింటెండెంట్ వడ్డెంపూడి సుజాత, మహిళా నాయకులు కోసూరి శ్రీదేవి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి...

ఒంగోలు సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న ఫిట్ ఇండియా కార్యక్రమంలో శనివారం వీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీసీ మూర్తి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు పురోభివృద్ధి సాధిస్తున్నారని, విద్య, ఉద్యోగం, వ్యాపార రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడుతున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీ తరపున ఏర్పాటు చేసిన 6కే రన్ కార్యక్రమాన్ని వీసీ మూర్తి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆంధ్రకేసరి యూనివర్సిటీ వద్ద నుంచి ప్రారంభమై మినీ స్టేడియం, భాగ్యనగర్ నాలుగో లైన్, రిమ్స్, నెల్లూరు బస్టాండు, రామ్‌నగర్ నాలుగో లైన్, ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం, బిలాల్ రెస్టారెంట్, నవోదయ స్కూల్ మార్గం మీదుగా తిరిగి ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణానికి చేరింది. యువతులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ మహిళాభ్యుదయం, మహిళా దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏకేయూ ఎంఎడ్ విభాగం సహాయ ఆచార్యురాలు డాక్టర్ అమృతవల్లి, శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వసంత లక్ష్మి, మహిళా అధ్యాపకులు ఏ సిరితేజ, పి.నాగలక్ష్మి, సహాయ ఆచార్యుడు ఆదపాల వెంకటేశ్వర్లు, బీపీఎడ్, ఎంపీఎడ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

హాస్టల్లో కేక్ కట్‌చేసిన బత్తుల పద్మావతి...

నగరంలోని సంతపేట సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం–2లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పద్మావతి కేక్ కట్ చేయగా, ఆమెను బాలికలు సన్మానించారు. హాస్టల్ సంక్షేమాధికారులు కటారి శ్రీలత, మల్లెబోయిన అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సదస్సు నిర్వహించారు. జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు కె.తిరుమల అధ్యక్షత వహించగా, ఏపీటీఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన పి.మాణిక్యాంబ చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ మంజుల, ఉపాధ్యాయినులు పుష్పాంజలి ఘటించారు. జిల్లా నాయకురాలు శాంతకుమారి, సమత, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, గురునాథశర్మ, రాష్ట్ర పూర్వ కార్యదర్శి విజయ సారధి, తదితరులు పాల్గొన్నారు.

■ రైజ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

■ ఒంగోలు నగరంలోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్ఎస్ఎన్ గ్రూప్ చైర్‌పర్సన్ రామలక్ష్మిని సన్మానించారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండటానికే వైద్య శిబిరాలు...

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతాల పేద మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి కెనరా బ్యాంక్ అనేక ఉచిత సేవలు అందిస్తోందని, అందులో భాగంగా శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిందని లీడ్ బ్యాంక్ జిల్లా చీఫ్ మేనేజర్ డి.రమేష్ అన్నారు. కొత్తపట్నంలో శ్రీరాం వెంకటరంగంశెట్టి కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కెనరా బ్యాంక్ కొత్తపట్నం శాఖ, ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కొత్తపట్నం కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ జి.విక్రమ్ అధ్యక్షత వహించగా, ప్రసూతి స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాధ కేక్ కట్‌చేశారు. వైద్య శిబిరాన్ని రమేష్, శ్రీనివాసులు, రాధ ప్రారంభించగా, 200 మందికి వైద్య పరీక్షల చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘ సభ్యులు డాక్టర్ ఎస్.రాధను సత్కరించారు కార్యక్రమంలో డాక్టర్ వి.జయవర్ధన్ (ఎండోక్రైనాలజీ వైద్య నిపుణులు), డివిజనల్ మేనేజర్ వై.శ్రీనివాసులు, రాఘవేంద్ర, అవినాష్, కెనరా బ్యాంక్ కొత్తపట్నం శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్య, ఫీల్డ్ ఆఫీసర్ జెశ్లీజాన్, బ్యాంక్ సిబ్బంది, వెలుగు సీసీ రామారావు, అబ్దుల్లా, వీవోఏలు పాల్గొన్నారు.

వేడుకలు నిర్వహించిన విశ్రాంత ఉద్యోగులు...

మద్దిపాడు: స్థానిక నటరాజ కళా కేంద్రం ఆవరణంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ యలమంద మాస్టర్ అధ్యక్షత వహించగా, మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శిరీష పాల్గొని మాట్లాడారు. అనంతరం డాక్టర్ శిరీషను సన్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యురాలు భవాని, గంగిశెట్టి నరసింహారావు, కాకుమాను సుబ్బారావు, సత్యనారాయణ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు

చీమకుర్తిలో...

చీమకుర్తి: మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఎక్సైజ్ సీఐ సుకన్యను లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ జవహర్, చలువాది బదరీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో మహిళా టీచర్లను సత్కరించారు.

జిల్లా రంగభూమి ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మహిళల గురించి పాటల పోటీలు నిర్వహించారు. గాయనీ గాయకులు పాటలు పాడి అలరించారు. పలు రంగాలలో ప్రతిభ చూపిస్తున్న మహిళలను సన్మానించారు.


సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య



జీజీహెచ్‌లో కేక్ కట్ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ నాయకులు


నర్సింగ్ స్కూల్లో మాట్లాడుతున్న డాక్టర్ జ్యోత్స్న


హాస్టల్లో కేక్ కట్ చేస్తున్న బత్తుల పద్మావతి


మద్దిపాడులో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ శిరీష, పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు


కొత్తపట్నంలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ రాధ, ఎల్‌డీఎం రమేష్


6కే రన్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ మూర్తి

అరుణోదయ కాలనీలో సమస్యల వెల్లువ

- సీపీఎం బృందం దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు


సమస్యలడిగి తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు, తదితరులు

సంతనూతలపాడు: 15 సంవత్సరాల క్రితం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి పైపులైన్ వేసి ప్రారంభించారు.. కానీ, ఒక్క చుక్క నీళ్లు కూడా వదల్లేదు.. వాడుకోవడానికి కూడా నీళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందంటూ పేర్నమిట్ట అరుణోదయకాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను జిల్లా కార్యదర్శి షేక్ మాబు ప్రారంభించారు. పేర్నమిట్ట అరుణోదయకాలనీలో పర్యటించగా, స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలైనా శాశ్వత మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. డ్రైనేజీలు కూడా శుభ్రం చేయడం లేదని, సుదూర ప్రాంతాల నుంచి పనుల కోసం పట్టణానికి వచ్చి అద్దెలకు ఉంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. వచ్చే కూలి తిండికే సరిపోతోందని, స్థలాలు కొనుక్కునే పరిస్థితిలో లేమని, ప్రభుత్వం గతంలో పట్టాలిచ్చిందిగానీ స్థలాలు చూపలేదని, ఇబ్బందులు పడుతున్నామని సీపీఎం బృందం దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, స్థానిక నాయకులు షేక్ కాలేషా, షేక్ కాశిం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయండి

చీమకుర్తి: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ప్రజాచైతన్య యాత్రలపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వాటిని పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పమిడి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, తొట్టెంపూడి రామారావు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

ఒంగోలు మెట్రో: స్థానిక ఉత్తర బైపాస్ రోడ్డులో న్యూ పంజాబీ దాబా వెనుక పరంజ్యోతి కల్కి ఆలయంలో శ్రీ భగవాన్ జన్మదినం సందర్భంగా శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ముందుగా అమ్మ భగవాన్ ఆశీస్సులతో శిష్యురాలైన సౌజన్య దాసాజీ అనుమతితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కంటి పరీక్షలు, ఎముకలు, మోకాళ్ల నొప్పులు, సాధారణ వ్యాధులకు, పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు ఉదయ్ కుమార్, రామాంజనేయులు, విజయలక్ష్మి పాల్గొని వైద్య సేవలు, మందులు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీ పరంజ్యోతి కల్కి మానవ సేవా సమితి సభ్యులు శేషగిరిరావు, సాంబశివరావు, కుమారి, తేజస్వి, వనజ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 13వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.